RNI No: TELTEL/2022/83073

వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:142 | జూన్ 2, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

బ్రహ్మోస్‌కు పెరుగుతున్న డిమాండ్

- వియత్నాంతో కీలక ఒప్పందం
- ఇండోనేషియాతో తుది చర్చలు

2లో

తెలంగాణపై జనసేనాని ఫోకస్!

'త్రిశూల్ వ్యూహం'తో అడుగులు

5 శాతం ఓట్లపై కన్ను



గ్రేటర్ హైదరాబాద్, ఏపీ సరిహద్దు జిల్లాలే ఫస్ట్ ప్రియారిటీ

- కేడర్‌ను స్ట్రాంగ్ చేసేలా రోడ్ మ్యాప్
- మున్నూరు కాపు, సెటిలర్లు, యువత ఓట్లే కీలకం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌కు గండి?!
- బీజేపీతో కొనసాగనున్న మిత్రధర్మం
- కింగ్ మేకర్ కావాలని సరికొత్త ప్లాన్
- రాబోయే గ్రేటర్ మున్సిపల్ ఎన్నికలే టార్గెట్
- వచ్చే అసెంబ్లీ సమరమే లక్ష్యంగా అడుగులు

2లో

వేద న్యూస్, ఎల్.కే (ప్రత్యేక ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించి ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన జనసేనాని పవన్ కళ్యాణ్.. ఇప్పుడు తన తదుపరి పొలిటికల్ ఫోకస్‌ను తెలంగాణపై కేంద్రీకరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ వేదికగా నేడు ఆయన తన పార్టీ శ్రేణులతో జరగనున్న కీలక సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సెటిలర్లు, యువత, మున్నూరు కాపు సామాజికవర్గ ఓటు బ్యాంకే లక్ష్యంగా జనసేన వేస్తున్న అడుగులు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో గుబులు రేపుతున్నాయి. కేవలం 4 నుంచి 5 శాతం ఓటింగ్ సాధించినా ఇక్కడి గెలుపోటములను తలకిందులు చేయగల సత్తా జనసేనకు ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలతో పాటు 2029 అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పవన్ కళ్యాణ్ నేటి మీటింగ్‌లో పక్కా రోడ్ మ్యాప్ ప్రకటించ నుండటంతో, భాగ్యనగరంలో ఆయన వేయబోయే పొలిటికల్ అడుగులపై అందరి కళ్లూ నిలిచాయి. కాగా, పవన్ సభకు అనుమతి నిరాకరించినట్లు సమాచారం.

రైతులు ఆందోళన చెందొద్దు

- ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తాం
- తడిసిన ధాన్యానికీ మద్దతు ధర ఇస్తాం
- 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలే లక్ష్యం
- మొక్కజొన్న, జొన్నలు కూడా కేంద్రం కొనాలి
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు జోక్యం చేసుకోవాలి
- మహారాష్ట్ర సహకరించడం లేదు
- రెండో విడతలో మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- తెలంగాణపై వివక్ష కొనసాగితే కార్యాచరణ ప్రకటిస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి

వేద న్యూస్, ఆసిఫాబాద్

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తడిసిన ధాన్యానికి కూడా కనీస మద్దతు ధర అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికే 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో స్వల్ప జాప్యం జరిగినా రైతులు అధైర్యపడవద్దని, ప్రతి గింజను కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పండిన మొక్కజొన్న, జొన్నలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను కూడా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని సీఎం ఆరోపించారు. ఏడాది కాలంగా చర్చలకు ప్రయత్నిస్తున్నప్పటికీ స్పందన రావడం లేదన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు

మిగతా 2వ పేజీలో

జనసేన సభకు అనుమతి నిరాకరణ

హైకోర్టును ఆశ్రయించిన పార్టీ - కోర్టు తీర్పుపై ఉత్కంఠ

తెలంగాణ అస్తిత్వంపై దాడులను సహించబోం

- అమరవీరుల కుటుంబాలకు పూర్తి న్యాయం జరగలేదు
- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి
- కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది
- తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుంది
- రైతులు, యువత, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధి సాధించాలి
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత

2లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విచారణ

- సిట్ ఎదుట ఇద్దరు ఎమ్మెల్యేలు
- ఆరోపణలపై వివరాల సేకరణ
- రాజకీయంగా ఆసక్తికర పరిణామం

2లో

వర్షా కాలానికి అప్రమత్తంగా ఉండాలి

- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన
- సాగునీటి ప్రాజెక్టులు సిద్ధంగా ఉంచాలి
- పట్టణాల్లో నీటి ముంపు నివారణకు చర్యలు
- విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యం
- ముందస్తు చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

2లో

వేద న్యూస్

మంగళవారం జూన్ 02, 2026

జనసేన సభకు అనుమతి నిరాకరణ

వేద న్యూస్, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభ–జనసేన సాధక్ సమ్మేళనంకు తెలంగాణ పోలీసులు అనుమతి నిరాకరించారు. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో జూన్ 2న ఈ సభను నిర్వహించాలని జనసేన పార్టీ ప్రణాళిక రూపొందించినప్పటికీ, శాంతిభద్రతల కారణాలను చూపుతూ పోలీసులు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో అధికారిక వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో భద్రతా బలగాలన్నీ ఆ విధుల్లో నిమగ్నమై ఉంటాయని పోలీసులు తెలిపారు. అదే రోజు రాజకీయ సభ నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్యలతో పాటు శాంతిభద్రతల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో సభ నిర్వహణకు అనుమతి నిరాకరిస్తూ సంబంధిత అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలకు భద్రత కల్పించడం ప్రస్తుతం ప్రధాన ప్రాధాన్య అంశమని పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. పోలీసుల నిర్ణయంపై జనసేన పార్టీ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. సభ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పార్టీ తరపున తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సభ నిర్వహణ తమ ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొంటూ అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరినట్లు తెలిసింది. ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. కొందరు రాజకీయ నాయకులు సభ నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, తెలంగాణలో పార్టీ విస్తరణలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని జనసేన వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో పార్టీ కార్యకర్తలను సమీకరించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయడమే లక్ష్యమని పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉండటంతో హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కోర్టు తీర్పు అనంతరం సభ నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విచారణ

వేద న్యూస్, హైదరాబాద్

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సోమవారం ప్రత్యేక విచారణ బృందం (సిట్) ఎదుట హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో తమ ఫోన్లు అక్రమంగా ట్యాపింగ్‌కు గురయ్యాయని వారు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు వారి నుంచి వివరాలు సేకరించారు. ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటికే దర్యాప్తు కొనసాగిస్తున్న సిట్ అధికారులు, చట్టపరమైన నిబంధనల మేరకు నోటీసులు జారీ చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఎమ్మెల్యేలను పిలిపించారు. ఈ సందర్భంగా ట్యాపింగ్ ఆరోపణలకు సంబంధించిన వివరాలు, వారి వద్ద ఉన్న సమాచారం, అనుమానాలకు గల కారణాలపై అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో ఈ ఇద్దరు ప్రజాప్రతినిధుల ఫోన్ నంబర్లు నిఘాకు గురైనట్లు సాంకేతిక ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు అధికారులు విచారణను మరింత లోతుగా నిర్వహిస్తున్నారు. ఆరోపణలకు మద్దతుగా ఉన్న ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో జారీ చేసిన నోటీసులకు అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయిన ఎమ్మెల్యేలకు తాజాగా మరోసారి నోటీసులు జారీ చేశారు. దాంతో వారు సిట్ ఎదుట హాజరై తమ వాంగ్మూలాలను నమోదు చేయించారు. అధికారులు సేకరించిన సాక్ష్యాధారాలను కూడా వారికి చూపించి వివరణలు తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారింది. రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అంశంపై వివిధ రాజకీయ పార్టీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం సిట్ దర్యాప్తు కొనసాగుతుండగా, కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల వెనుక వాస్తవాలు ఏమిటన్న దానిపై దర్యాప్తు బృందం అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసు భవిష్యత్‌లో తెలంగాణ రాజకీయాల్లో మరింత ప్రాధాన్యత సంతరించుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వరాకాలానికి అప్రమత్తంగా ఉండాలి

వేద న్యూస్, హైదరాబాద్

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, విపత్తు నిర్వహణ తదితర శాఖల అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. వర్షపాత పరిస్థితులు, సాగునీటి ప్రాజెక్టుల సంసిద్ధత, రైతులకు అందించాల్సిన సూచనలు, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వాతావరణ శాఖ అధికారులు ఈ ఏడాది వర్షపాత అంచనాలు, ఎల్‌నినో ప్రభావం, రుతుపవనాల పరిస్థితులను వివరించారు. వర్షాభావం ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం సూచించారు. రైతులకు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని జలాశయాలు, బ్యారేజీలు, ఆనకట్టలు, కాలువల నిర్వహణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే అన్ని ప్రాజెక్టులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. పట్టణాల్లో నీటి ముంపు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా కాలువల పూడికతీత, మురుగు కాలువల శుభ్రత పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. భారీ వర్షాలు, వరదలు, పిడుగుపాట్లు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ స్పందన కోసం విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణపై జనసేనాని ఫోకస్!

'త్రిశూల్ వ్యూహం'తో అడుగులు

5 శాతం ఓట్లపై కన్ను



గ్రేటర్ హైదరాబాద్, ఏపీ సరిహద్దు జిల్లాలే ఫస్ట్ ప్రియారిటీ

- కేడర్‌ను స్ట్రాంగ్ చేసేలా రోడ్ మ్యాప్
- మున్నూరు కాపు, సెటిలర్లు, యువత ఓట్లే కీలకం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌కు గండి?!
- బీజేపీతో కొనసాగనున్న మిత్రధర్మం
- కింగ్ మేకర్ కావాలని సరికొత్త ప్లాన్
- రాబోయే గ్రేటర్ మున్సిపల్ ఎన్నికలే టార్గెట్
- వచ్చే అసెంబ్లీ సమరమే లక్ష్యంగా అడుగులు

వేద న్యూస్, ఎల్.కే (ప్రత్యేక ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేట్‌తో సరికొత్త రికార్డు సృష్టించి, ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జనసేనాని పవన్ కళ్యాణ్.. ఇప్పుడు తన తదుపరి పొలిటికల్ ఫోకస్‌ను తెలంగాణపై కేంద్రీకరించారు. ఏపీలో తిరుగులేని అధికార పీఠాన్ని దక్కించుకున్న 'తెలుగుదేశం–జనసేన' కూటమి నేతలు.. తమ తదుపరి టార్గెట్ తెలంగాణేనని బాహాటంగానే ప్రకటిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బలంగా ఉండి, విభజన తర్వాత బలహీనపడిన క్యాడర్‌కు మళ్లీ జీవం పోసేందుకు ఇరు పార్టీల అధినేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన నేడు హైదరాబాద్ వేదికగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన పార్టీ శ్రేణులతో జరపబోయే కీలక సమావేశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెనుదుమారం రేపుతోంది.

'త్రిశూల్ వ్యూహం'తో అడుగులు

ఏపీ కూటమి విజయానికి వెన్నెముకగా నిలిచిన పవన్ కళ్యాణ్, తెలంగాణలో జనసేన కేవలం నామమాత్రపు పార్టీ కాదని, ఇక్కడ కూడా ఒక నిర్ణయాత్మక శక్తిగా ఎదగడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. తనపై, తన పార్టీపై వస్తున్న విమర్శలకు నేడు ఏర్పాటు చేయబోయే సమావేశం వేదికగా తన స్టైల్‌లో గట్టి కౌంటర్ ఇచ్చేందుకు జనసేనాని సిద్ధమయ్యారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య నడుస్తున్న త్రిముఖ పోరును గమనించిన పవన్.. ఇక్కడ 'త్రిశూల్ వ్యూహం'తో ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో జనసేన ఒంటరిగా, వ్యూహాత్మకంగా పోటీ చేసినా.. అదనంగా 4 నుంచి 5 శాతం ఓటింగ్ సాధిస్తే అది ఇక్కడి ప్రభుత్వాల మనుగడను మార్చేస్తుంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ, ఏపీ సరిహద్దు జిల్లాల్లోనూ జనసేనకు ఉన్న బలమైన యువ ఓటు బ్యాంకే ఆయుధంగా పవన్ రంగంలోకి దిగుతున్నారు.

ప్రధాన పార్టీల్లో గుబులు

తెలంగాణలో జనసేన పుంజుకుంటే అది ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల ఓటు బ్యాంకును నిలువునా దెబ్బతీసే అవకాశం ఉంది. గ్రేటర్ పరిధిలోని సెటిలర్ల ఓట్లు, పవన్ ఇమేజ్ చూసి పడే యువత ఓట్లతో పాటు తెలంగాణలో అత్యంత కీలకమైన 'మున్నూరు కాపు' సామాజిక వర్గానికి చెందిన ఓట్లు కనుక జనసేన వైపు మళ్లితే.. స్వల్ప మెజారిటీతో గెలిచే స్థానాల్లో ఫలితాలు పూర్తిగా తలకిందులవుతాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి బీజేపీకి ఓట్లు మళ్లుతున్న తరుణంలో, పవన్ కళ్యాణ్ ప్రవేశం కాంగ్రెస్‌కు కూడా పెద్ద సవాలుగా మారనుంది. పవన్ తన ప్రసంగాల్లో మాట్లాడే ప్రజాస్వామ్య పరిరక్షణ, నిబద్ధత ఇక్కడి యువతను అమితంగా ఆకర్షిస్తుండటంతో.. ఈ 5 శాతం ఓట్లు ఎవరి ఖాతా నుంచి మళ్లుతాయి అనేదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారి, పెద్ద పార్టీలలో గుబులు రేపుతోంది.

వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్

గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన ప్రభావం చూపనప్పటికీ.. ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌కు పెరిగిన గ్రాఫ్, ఇమేజ్ తెలంగాణలో ప్లస్ అవుతుందని కేడర్ నమ్ముతోంది. నేటి మీటింగ్‌లో తెలంగాణలో పార్టీ నిర్మాణం, జిల్లా స్థాయి కమిటీల బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటాలతో పాటు పవన్ కళ్యాణ్ ఒక పక్కా రోడ్ మ్యాప్ ప్రకటించనున్నారు. త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతో పాటు, 2029 అసెంబ్లీ ఎన్నికల కోసం కేడర్‌ను స్ట్రాంగ్ చేయాలనే ఆలోచనలో జనసేన నాయకత్వం ఉంది. బీజేపీతో ఉన్న మిత్రధర్మాన్ని కొనసాగిస్తూనే.. ఇక్కడ స్వతంత్రంగా ఎదగాలని, ఒకవేళ పొత్తులు కుదిరితే అది బీజేపీకి అదనపు బలం అవుతుందని, ఒంటరిగా వెళ్తే కింగ్ మేకర్ పాత్ర పోషించవచ్చని పవన్ భావిస్తున్నారు. ఏది ఏమైనా, నేడు భాగ్యనగరం వేదికగా పవన్ కళ్యాణ్ వేయబోయే పొలిటికల్ అడుగులు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి సెన్సేషన్ సృష్టిస్తాయో చూడాలి.

తెలంగాణ అస్తిత్వంపై దాడులను సహించబోం

- అమరవీరుల కుటుంబాలకు పూర్తి న్యాయం జరగలేదు
- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి
- కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది
- తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుంది
- రైతులు, యువత, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధి సాధించాలి
- తెలంగాణ రక్షణ సేన అభినేత్రి కవిత

వేద న్యూస్, హైదరాబాద్

తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు–సాధన రౌండ్ టేబుల్ సమావేశంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వం, హక్కుల పరిరక్షణ కోసమే తమ పార్టీ పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అమరవీరులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చలేదని విమర్శించారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ, ఉద్యమకారుల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమం దేశవ్యాప్తంగా ఆదర్శప్రాయ ప్రజా ఉద్యమంగా నిలిచిందని పేర్కొన్న కవిత, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం సాధన తమ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధికి ప్రజలు, ఉద్యమకారులు సూచనలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

రైతులు ఆందోళన చెందొద్దు

మొదటి పేజీ తరువాయి

అందుతుందని తెలిపారు. తెలంగాణకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించాలని కోరిన ముఖ్యమంత్రి, వివక్ష కొనసాగితే జూన్ 15 తర్వాత తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై మాట్లాడుతూ రాష్ట్రంలోని గూడాలు, తండాల్లో గుడిసెలు లేకుండా చేయడమే లక్ష్యమన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రెండో విడతగా మరో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, వివేక్ వెంకటస్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోస్‌కు పెరుగుతున్న డిమాండ్

- వియత్నాంతో కీలక ఒప్పందం
- ఇండోనేషియాతో తుది చర్చలు

వేద న్యూస్, నేషనల్ బ్యూరో

భారత రక్షణ రంగానికి మరో కీలక విజయం దక్కింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందిన బ్రహ్మోస్‌ను వియత్నాంకు విక్రయించేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశకు చేరుకున్నట్లు భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో నిర్వహించిన షాంగ్రీ–లా భద్రతా సదస్సులో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందంపై ఇప్పటికే సంతకాలు పూర్తయ్యాయని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు. అధికారిక ప్రకటన వెలువడకపోయినా ఒప్పంద ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఈ ఒప్పందం విలువ సుమారు రూ.5,800 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక సహకారం కూడా అందించనున్నారు. ఇండోనేషియాతో చర్చలు కూడా వేగంగా సాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య మిగిలిన అంశాలపై సంప్రదింపులు ముగింపు దశలో ఉన్నాయని, త్వరలోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఆగ్నేయాసియా ప్రాంతంలో భారత రక్షణ ఉత్పత్తులకు మరింత మార్కెట్ లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు భారీ ఒప్పందం కుదుర్చుకుంది. దాంతో భారత దేశం నుంచి బ్రహ్మోస్ కొనుగోలు చేసిన తొలి విదేశంగా ఫిలిప్పీన్స్ నిలిచింది. ఇప్పుడు వియత్నాం కూడా ఆ జాబితాలో చేరగా, ఇండోనేషియా త్వరలో చేరే అవకాశాలు ఉన్నాయి. చైనాతో సముద్ర సరిహద్దు వివాదాలు ఎదుర్కొంటున్న దేశాలు తమ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకునేందుకు బ్రహ్మోస్‌పై ఆసక్తి చూపుతున్నాయి. ధ్వని వేగం కన్నా మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించే సామర్థ్యం ఉంది. శత్రు యుద్ధనౌకలు, కీలక సైనిక స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకుని దాడి చేయగలదు. దీని వేగం, ఆధునిక సాంకేతికత కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను 2030 నాటికి రూ.50వేల కోట్లకు పెంచాలనే లక్ష్యంతో భారత్ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో బ్రహ్మోస్ ఒప్పందాలు భారత రక్షణ పరిశ్రమకు కొత్త అవకాశాలు తెరుస్తున్నాయి. మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఇతర ఆగ్నేయాసియా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

వేద న్యూస్

మంగళవారం జూన్ 02 , 2026

డాక్టర్ పట్టా అందుకున్న నారగాని దివ్య

- హోమియోపతి వైద్య విద్యలో విజయవంతం
- దివ్యకు శుభాకాంక్షలు తెలిపిన గ్రామస్తులు

వేద న్యూస్, నడికూడ:

హనుమకొండ జిల్లా నడికూడ మండల కేంద్రానికి చెందిన నారగాని అనితరమేష్ దంపతుల కుమార్తె నారగాని దివ్య హోమియోపతి వైద్య విద్యను విజయ వంతంగా పూర్తి చేసి డాక్టర్ పట్టా అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని శ్రీ సత్యసాయి కాలేజ్ ఆఫ్ హోమియోపతిక్ మెడికల్ సైన్సెస్ అండ్ హాస్పిటల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె ఇటీవల డాక్టర్ పట్టాను స్వీకరించారు. సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి కష్టపడి వైద్యురాలిగా ఎదగడం ఆనందంగా ఉందని దివ్య తెలిపారు. భవిష్యత్తులో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. దివ్య డాక్టర్ పట్టా పొందిన సందర్భం గా గ్రామస్తులు, బంధుమిత్రులు, స్నేహితులు ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మరింత ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- వర్షాలతో పంట నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలి
- టీఆర్ఎస్ నాయకుడు దండు సుధాకర్

వేద న్యూస్, నడికూడ:

పరకాల నియోజకవర్గ పరిధిలో రబీ ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో రైతులు నష్టపోతున్నారని తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుడు దండు సుధాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో రైతులు రోజుల తరబడి పంటను కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. తేమ శాతం పేరుతో కొనుగోళ్లు ఆలస్యం చేయడం, గోనె సంచులు, లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. దళారులకు అమ్మితే కనీస మద్దతు ధర లభించడం లేదని, ప్రభుత్వ కొనుగోళ్ల కోసం రైతులు నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సెలవు దినాల్లో కూడా కొనుగోళ్లు నిర్వహించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జల్గురి రమేష్, చుక్క ప్రభాస్, మధు, సమ్మయ్య, ఐలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ కమిషనర్‌గా నరేష్ రెడ్డి

- పదోన్నతిపై వెళ్లిన విజయనంద్‌కు ఘన వీడ్కోలు



వేద న్యూస్, మరిపెడ:

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కమిషనర్‌గా కంచర్ల నరేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన రామడుగు విజయనంద్ పదోన్నతిపై కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ కాగా, భువనగిరి మున్సి పాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న నరేష్ రెడ్డి మరిపెడకు కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విజయనంద్‌కు ఘనంగా వీడ్కోలు పలికి సన్మానించారు. మరిపెడ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కొత్త కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నరేష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మక్కల కొనుగోళ్లలో చొప్పదండి రికార్డు

- రాష్ట్రంలోనే అతిపెద్ద కేంద్రంగా చొప్పదండి మార్కెట్
- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్

వేద న్యూస్, చొప్పదండి:

చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో 50 వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసి రాష్ట్రంలోనే సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో ఈ కేంద్రానికి అనుమతులు లభించాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిమిత కేంద్రాలకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, రైతుల అభ్యర్థన మేరకు చొప్పదండి మార్కెట్‌ను మక్కల కొనుగోలు కేంద్రంగా ఏర్పాటు చేసి ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని చెప్పారు. చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల రైతులకు క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర లభించడంతో గణనీయమైన ప్రయోజనం చేకూరిందన్నారు. కొనుగోళ్ల సమయంలో లారీల కొరత, నిల్వ సమస్యలు తలెత్తకుండా గోదాములు ఏర్పాటు చేయించి రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. దళారుల జోక్యం లేకుండా, తూకంలో మోసాలకు తావులేకుండా కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, రైతు కష్టానికి తగిన గౌరవం దక్కేలా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నట్లు చైర్మన్ తెలిపారు.

నిరుపేదల అంతిమ సంస్కారాలకు ప్రత్యేక వసతులు కల్పిస్తాం

- పద్మాక్షి శివ ముక్తి ధామ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని
- కలెక్టర్, కుడా చైర్మన్‌తో కలిసి మౌలిక సదుపాయాలపై సమీక్ష

వేద న్యూస్, హనుమకొండ:

నిరుపేద కుటుంబాలు, వలస కార్మికులు తమ ఆత్మీయుల అంతిమ సంస్కారాలు గౌరవప్రదంగా నిర్వహించుకునేందుకు అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి సూచన మేరకు సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్, అధికారులతో కలిసి పద్మాక్షి శివ ముక్తి ధామ్‌ను పరిశీలించి అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబాలకు అంతిమ సంస్కారాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, పుల్లూరి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, సామాజిక సేవకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బావి చెత్తకుప్పగా మారింది

- దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న 2వ వార్డు ప్రజలు
- వెంటనే శుభ్రపరిచి వినియోగంలోకి తేవాలని డిమాండ్

వేద న్యూస్, నల్లబెల్లి:

నల్లబెల్లి గ్రామంలోని 2వ వార్డులో ఉన్న ప్రభుత్వ బావి పూర్తిగా నిరుపయోగంగా మారి చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. బావిలోని నీరు కలుషితమై తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో చుట్టుపక్కల నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని సంరక్షించాల్సిన అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించి బావిలోని చెత్తను తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రపరచాలని, రక్షణ గోడ లేదా నెట్ ఏర్పాటు చేయాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న బావిని పునరుద్ధరించి కాలనీలోని నీటి సమస్య పరిష్కారానికి వినియోగంలోకి తీసుకురావాలని కనకం ప్రణీత్ కోరారు.

బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, దావ వసంత
- కాలిపోయిన పామాయిల్ తోట పరిశీలన

వేద న్యూస్, రాయికల్:

రాయికల్ మండలం కొత్తపేట గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన పామాయిల్ తోటను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పరిశీలించారు. స్థానిక నాయకులతో కలిసి ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత రైతు నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేతికందే సమయంలో పంట అగ్నికి ఆహుతి కావడం బాధాకరమన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతు కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ నిలబడుతుందని, బాధితుడికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం జూన్ 02 , 2026

డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా!

- ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయొద్దు
- కొప్పుల ఈశ్వర్‌కు మంత్రి అడ్లూరి కౌంటర్
- తడిసిన ధాన్యం, మక్కజొన్నలను కొనుగోలు చేస్తామని హామీ

వేద న్యూస్, ధర్మారం:

ఇసుక దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో అకాల వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలోనే ఇసుక అక్రమ రవాణా విస్తృతంగా జరిగిందని, నేరేళ్ల ప్రాంతంలో ఇసుక రవాణాపై నిరసన తెలిపిన దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటనలను గుర్తు చేశారు. ధర్మపురి నియోజకవర్గంలో ఇసుక దందాలో తనకు వాటా ఉందని నిరూపిస్తే వెంటనే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. రాజకీయ విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, నిరాధార ఆరోపణలు మానుకోవాలని సూచించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మక్కజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తరఫున తగిన సహాయం అందిస్తామని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా పవన్ బాధ్యతల స్వీకరణ

వేద న్యూస్, పరకాల:

పరకాల మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా పోతురాజు పవన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన అంజయ్య ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్ పవన్‌కు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన వాటర్ లైన్మెన్‌కు సన్మానం

- 30 ఏళ్లపాటు ప్రజలకు సేవలందించిన నర్సింగరావు

వేద న్యూస్, వరంగల్ టౌన్:

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 30 సంవత్సరాలపాటు వాటర్ లైన్మెన్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించిన రాంపల్లి నర్సింగరావు పదవీ విరమణ సందర్భంగా ఆయన దంపతులను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం తాగునీటి సరఫరా అందించడంలో నర్సింగరావు విశేష సేవలు అందించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాంపల్లి నర్సింగరావు దంపతులతో పాటు మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్, గుండు రాజు, కాచర్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రొడక్షన్ నెం.2 సినిమాకు క్లాప్ కొట్టిన సూర్య

- షైన్ స్టూడియో బ్యానర్ లో సినిమా చిత్రీకరణ
- రామలింగేశ్వర స్వామికి సినిమా యూనిట్ బృందం ప్రత్యేక పూజలు

వేద న్యూస్, ములుగు :

షైన్ స్టూడియో బ్యానర్ పై రూపొందుతున్న "ప్రొడక్షన్ నెం. 2 సినిమాను ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయంలో సోమవారం మంత్రి సీతక్క తనయుడు సూర్య, రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ లు ముఖ్యఅతిథులుగా హాజరై క్లాప్ కొట్టి సినిమా షూటింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ములుగు జిల్లా ప్రాంతంలో షైన్ స్టూడియోస్ బ్యానర్ పై సినిమాను చిత్రీకరించడం అభినందనీయమని అన్నారు. ములుగు జిల్లా ప్రాంతంలో పుణ్య, పర్యాటక ప్రాంతాలు అనేకం ఉన్నాయని వారు పేర్కొన్నారు. సమాజానికి చక్కటి సందేశాన్నిచ్చే సినిమాను ములుగు జిల్లా ప్రాంతంలో తీయడం సంతోషించదగ్గ విషయమని వారు పేర్కొన్నారు. అనంతరం వారు సినిమా యూనిట్ బృందంతో కలిసి రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు చిత్ర యూనిట్ సభ్యులతో పాటు అతిథులకు స్వామివారి ఆశీర్వచనాలను,తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు, వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు, ప్రొడ్యూసర్ వేణు యాదవ్, హీరో అజయ్, మూవీ డైరెక్టర్ నేరెళ్ల దేవేందర్, కో డైరెక్టర్ ఆర్య అరవింద్, లిరిక్స్ రైటర్ రాజ్ కుమార్, మూవీ ఎడిటర్ యూనిక్, డిఓపి తరుణ్, అసిస్టెంట్ డైరెక్టర్ లోకేష్, ప్రొడక్షన్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గౌతమ్, సిద్దు, రఘు, రాహుల్, రఘుపతి, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీలో ఉద్యోగం సాధించిన రైతు బిడ్డ

- రెండో ప్రయత్నంలోనే లక్ష్యాన్ని చేరుకున్న హర్షవర్ధన్

వేద న్యూస్, వడ్డేపల్లి:

వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన రైతు కుటుంబ యువకుడు ఎస్.జి. హర్షవర్ధన్ భారత ఆర్మీలో ఉద్యోగం సాధించి గ్రామానికి గర్వ కారణంగా నిలిచాడు. చిన్ననాటి నుంచే దేశసేవ చేయాలనే లక్ష్యంతో ఆర్మీలో చేరాలని సంకల్పించిన హర్షవర్ధన్, కఠోర శ్రమ మరియు పట్టుదలతో రెండో ప్రయత్నంలోనే తన లక్ష్యాన్ని చేరుకున్నాడు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ, చిన్ననాటి కల నెరవేరడం ఎంతో ఆనందంగా ఉందని, దేశ సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఆర్మీలో ఉద్యోగం సాధించిన హర్షవర్ధన్‌ను గ్రామస్తులు, యువకులు, బంధుమిత్రులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సంతానం పేరుతో దంపతులను మోసం చేసిన బాబా!

- ప్రత్యేక పూజల పేరిట రూ.80 వేలకు పైగా వసూళ్లు
- సంతానం కలుగుతుందని నమ్మించి డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణ
- డబ్బులు తిరిగి అడిగితే బెదిరింపులంటూ ఫిర్యాదు
- బాబా, ఇద్దరు అనుచరులపై కేసు నమోదు

వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:

సంతానం కోసం ఆశ్రయించిన దంపతులను నమ్మించి డబ్బులు వసూలు చేసిన ఘటన ఇబ్రహీంపట్నం మండలంలోని భర్తీపూర్ గ్రామంలో వెలుగుచూసింది. నిజామాబాద్ జిల్లా కోనసముందర్ గ్రామానికి చెందిన జంగిటి భార్గవి, రాజేశ్వర్ దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడు సంవత్సరాలుగా సంతానం లేకపోవడంతో చికిత్స కోసం తిరుగుతున్న తమకు భర్తీపూర్ గ్రామానికి చెందిన కిరణ్, అఖిల్ అనే వ్యక్తులు పరిచయమై, మోహన్ యోగి అనే బాబా ప్రత్యేక పూజలు చేస్తే సంతానం కలుగుతుందని నమ్మించారని బాధితులు తెలిపారు. పూజా సామగ్రి పేరుతో మొదట రూ.40 వేలు, అనంతరం మరో రూ.40,116 తీసుకున్నట్లు పేర్కొన్నారు. పూజలు చేసినప్పటికీ ఏడాది గడిచినా ఫలితం లేకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, తమను చంపేస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు భర్తీపూర్ గ్రామానికి చెందిన మోహన్ యోగి, కిరణ్, అఖిల్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై జి. నవీన్ కుమార్ తెలిపారు.

పర్దిపూర్ కార్యదర్శిగా నవీన్ కుమార్ రెడ్డి

వేద న్యూస్, చిన్నచింతకుంట:

చిన్నచింతకుంట మండల పరిధిలోని పర్దిపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నవీన్ కుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పర్దిపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన కురుమన్న దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ గ్రామానికి బదిలీపై వెళ్లారు. కాగా, దామగ్నాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నవీన్ కుమార్ రెడ్డి పర్దిపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు.

బాధితుల సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ డే లక్ష్యం

- ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ
- త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడమే గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 33 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులను చట్టపరంగా వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని సూచించారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల తరలింపు రద్దుపై హర్షం

- ఎమ్మెల్యే పోచారం చిత్రపటానికి క్షీరాభిషేకం
- సీట్ల సంఖ్య 40 నుంచి 80కి పెంపుపై ఆనందం

వేద న్యూస్, రుద్రూర్:

రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను జగిత్యాల ప్రాంతానికి తరలించే ప్రతిపాదన రద్దు కావడంతో గ్రామస్తులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల రాజులకు కూడా ధన్యవాదాలు తెలిపారు. కళాశాలలో ప్రస్తుతం ఉన్న 40 సీట్లను 80కు పెంచడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముదునూరి సీతారామరాజు, జహీరాబాద్ పార్లమెంటరీ దిశా సభ్యులు నడిపింటి నగేష్, మాజీ సర్పంచ్ రామగౌడ్, ఉపసర్పంచ్ శంకర్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు యువత గుడ్‌బై..

- ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్లో చేరిన యువకులు

వేద న్యూస్, చిన్నచింతకుంట:

చిన్నచింతకుంట మండలం ఫర్దిపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోప్యా నాయక్ తండాకు చెందిన పలువురు యువకులు సోమవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో రమేష్ నాయక్, శ్రీను నాయక్ ఆధ్వర్యంలో సురేష్ నాయక్, విక్రమ్, తరుణ్, చిన్న సురేష్, భాస్కర్, వినోద్, శివ, శ్రీహరి తదితరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ కార్యకర్తలు పాత, కొత్త అనే తేడా లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే చేపడుతున్న కార్యక్రమాలను చూసి, తమ తండా అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరచింతలో ఎస్‌బీఐ ఏర్పాటు చేయాలి

- బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన అఖిలపక్ష నాయకులు

వేద న్యూస్, దేవరకద్ర:

అమరచింత మండల కేంద్రంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం అఖిలపక్ష నాయకులు, స్థానిక ప్రజలు ఆత్మకూరు ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. అమరచింత మున్సిపాలిటీ, మండల కేంద్రం అయినప్పటికీ ప్రస్తుతం ఒక్క యూనియన్ బ్యాంకు మాత్రమే ఉండడంతో వేలాది మంది ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బ్యాంకు పనుల కోసం ప్రజలు రోజంతా సమయం వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం అమరచింతలో ఎస్‌బీఐ శాఖను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మంగ లావణ్య, కో-ఆప్షన్ సభ్యులు ఎస్. అజయ్, నర్సింలు గౌడ్, జె. రాజన్న, కె. లక్ష్మీనారాయణ, ఎస్. మస్లమని, రవీందర్, మాజీ సర్పంచ్ గోపాల్, ఎ. రఘు, కె. విజయ్, ఎ. వెంకటస్వామి, రఫీ, ఫిరోజ్, కవి తిరుమలేశ్, అడ్వకేట్ రామచందర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచుల ఆందోళన

- సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి

వేద న్యూస్, నడికూడ:

గ్రామాభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో నడికూడ మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికీ చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు, రాయపర్తి మాజీ సర్పంచ్ రావుల రాజిరెడ్డి, ముస్త్యాలపల్లి మాజీ సర్పంచ్ బొట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులందరికీ రూ.4 వేల పింఛన్ ఇవ్వాలి

- ఎంపీడీవో కార్యాలయం ముందు బీడీ కార్మికుల ధర్నా

వేద న్యూస్, కోటగిరి:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ రూ.4 వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో సోమవారం కోటగిరి ఎంపీడీవో కార్యాలయం ముందు బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం, వ్యక్తిగత దరఖాస్తులను ఎంపీడీవోకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి. మల్లేష్ మాట్లాడుతూ, బీడీ కార్మికులకు కట్‌ఆఫ్ తేదీని తొలగించి రూ.4 వేల పింఛన్ ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం బీడీ పరిశ్రమలో సరిపడా పని లేక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీని అమలు చేసి చేయూత పథకం ద్వారా రూ.4 వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక నాయకులు బాలకృష్ణ, కళావతి, లక్ష్మి, గంగామణి, సావిత్రి, సునందతో పాటు పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

- నాణ్యతలో రాజీ పడొద్దని సూచన

వేద న్యూస్, నడికూడ:

నడికూడ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన ప్రభుత్వ ఆసుపత్రి, గోదాములు, పరకాల ఇందిరా మహిళా డెయిరీ బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్ భవన నిర్మాణ పనులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్ర దేవేందర్ గౌడ్, నడికూడ గ్రామ సర్పంచ్ కుడ్ల మల్లయ్య రావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ప్రతిపాదనను విరమించాలి

- జిల్లా కలెక్టర్‌కు ధర్మ సమాజ్ పార్టీ వినతిపత్రం

వేద న్యూస్, కొందుర్గ్:

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామ శివారులో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ఏర్పాటును వెంటనే విరమించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డును సిద్ధాపూర్‌కు తరలించి, ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ముప్పుగా మారుతుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం డంపింగ్ యార్డు ఏర్పాటుకు సంబంధించిన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విశారదన్ మహారాజ్ నాయకత్వంలో భారీ ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు గంట్లవెల్లి రాకేష్, జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భవాని శేఖర్, స్టాలిన్ రవీంద్ర మహారాజ్, నరసింహ, రాము, శివ, నరేష్, నవీన్, రాఘవేందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మద్యంమత్తులో స్నేహితుల మధ్య గొడవ..వ్యక్తి మృతి

వేద న్యూస్ హైదరాబాద్ :

మద్యం మత్తులో స్నేహితుల మధ్య ప్రారంభమైన గొడవ వ్యక్తి ప్రాణాన్ని బలితీసుకుంది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని బోళానగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్(33) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతడితో పాటు మల్లేప్లల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్న అహ్మద్ హుస్సేన్, మరికొంతమంది స్నేహితులు కలిసి ఆదివారం రాత్రి బంజారాహిల్స్ రోడ్ నెం 1లోని హయత్ ప్లేస్ సమీపంలోని ఆటో స్టాండ్‌లో తమ ఆటోల్లో కూర్చుని మద్యం సేవించారు.మద్యం సేవించడం పూర్తయిన తర్వాత ఖాళీ బాటిళ్లను రోడ్డుపై పారవేస్తున్న అహ్మద్ హుస్సేన్‌ను ఇమ్రాన్ దూషించడంతో గొడవ ప్రారంభమయింది. మాటామాటా పెరగడంతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో ఇమ్రాన్‌పై పిడిగుద్దులతో అహ్మద్ హుస్సేన్ విరుచుకుపడడంతో కుప్పకూలాడు. అతడిని స్థానికులు మహావీర్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ మేరకు ఫిర్యాదును అందుకున్న పోలీసులు నిందితుడు అహ్మద్ హుస్సేన్‌ను అరెస్ట్ చేశారు.

వేద న్యూస్

మంగళవారం జూన్ 02 , 2026

జమ్మికుంటకు ఖ్యాతి 'ప్రసంగి'

- రాష్ట్ర స్థాయి నృత్య పోటీలలో డ్యాన్స్ స్టూడియో విజయ పతాకం

వేద న్యూస్, జమ్మికుంట:

మే 30, 31 తేదీలలో కరీంనగర్‌లోని కళాభారతి ఆడిటోరియంలో సన్‌షైన్ కల్చరల్ అకాడమీ 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీలలో జమ్మికుంటకు చెందిన ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. కేవలం 40 రోజుల సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులతోనే వరుసగా మూడు రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో విజయాలు సాధించడం ప్రసంగి డాన్స్ స్టూడియో ప్రత్యేకతగా నిలిచింది. ఈ విజయాలతో జమ్మికుంట పట్టణానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. పోటీలలో లియాప్రసంగి, నాట్యప్రసంగి నృత్య బృందాలు అద్భుత ప్రదర్శన కనబరిచి ప్రథమ బహుమతులు అందుకోగా, జూనియర్ గర్ల్స్ గ్రూప్, బాయ్స్ గ్రూప్ మరియు తన్మయి గ్రూప్ ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. అలాగే అర్జున్ మరియు విక్రుత్ రెడ్డి ప్రత్యేక నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కొరియోగ్రాఫర్ పాప్ చిక్ శ్రీధర్ విజేతలను అభినందించారు. పోటీల న్యాయనిర్ణేతలు కె.ఎం.ఎస్. శ్రీనివాస్, ఉమా మహేశ్వర్ విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, తక్కువ సమయంలోనే ఇంతటి స్థాయి ప్రదర్శన ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.అలాగే కట్ట రమేష్, రోషన్ రజాక్, గజ్జెల ధర్మేందర్ , రామకృష్ణ విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ మేనేజర్, ప్రొప్రైటర్ ఎన్. శ్రీలత, డాన్స్ మాస్టర్లు ప్రసంగి, కే. రాజేష్ , సిద్ధు విద్యార్థుల విజయాలపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్. శ్రీలత మాట్లాడుతూ,.. "40 రోజుల సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వేదికలపై అద్భుత ప్రతిభ కనబరిచి వరుస విజయాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తాం" అని తెలిపారు.

రోడ్డు వెడల్పును 30 ఫీట్లకు తగ్గించాలి!

- ఇళ్లు కోల్పోతున్న కుటుంబాల వినతి

వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో ప్రతిపాదిత రోడ్డు వెడల్పును 60 ఫీట్ల నుంచి 30 ఫీట్లకు తగ్గించాలని కోరుతూ సుమారు 40 కుటుంబాలకు చెందిన బాధితులు సోమవారం పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి-శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ కొండాపురం వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 60 ఫీట్ల రోడ్డు విస్తరణ అమలైతే పేద కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, కొందరికి ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలం కూడా లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మాణం చేపట్టిన ఇల్లు కూడా తొలగించే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. రోడ్డు వెడల్పును 30 ఫీట్లకు పరిమితం చేసి, ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు స్థలాలు కూడా కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలోని బైపాస్ రోడ్డును గంగమ్మ గుడి వరకు పొడిగించి నిర్మించాలని కోరారు. బాధితుల సమస్యను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

దాడి కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్

వేద న్యూస్, శాయంపేట:

పథకం ప్రకారం ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, శాయంపేట గ్రామానికి చెందిన మారేపల్లి రాహుల్ ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణలో భాగంగా నిందితుడు మారేపల్లి రాహుల్‌ను కోర్టులో హాజరుపరచగా, పరకాల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సాయి శరత్ 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం నిందితుడిని పరకాల సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

దేశబోయిన వెంకట్రాములు దశదినకర్మ

- చిత్రపటానికి నేతల నివాళులు

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:

వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశబోయిన వెంకట్రాములు ఇటీవల మృతి చెందగా, సోమవారం లక్ష్మీదేవిగూడెంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, టీఆర్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒట్టే జానయ్య యాదవ్, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తదితరులు హాజరై వెంకట్రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వెంకట్రాములు జీవితాంతం ప్రజాసేవకు అంకితమై పనిచేశారని, గ్రామాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను, ఓబీసీ స్టేట్ కోఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకట్రాములు లేని లోటు గ్రామానికి, కాంగ్రెస్ పార్టీకి తీరనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జీవో నెం.17ను వెంటనే రద్దు చేయాలి

- సిరిసిల్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ డిమాండ్
- రద్దు వరకు ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరిక

వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 17ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ కొంకట శేఖర్ మాట్లాడుతూ, గురుకుల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్య, వసతులు అందించడంలో స్థానిక వర్గాలకు అవకాశం కల్పించే విధానాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఆరోపించారు. జీవో నెం.17 వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. గురుకుల విద్యాసంస్థల్లో చోటుచేసుకుంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, అన్ని వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెం.17ను రద్దు చేసే వరకు క్షేత్రస్థాయిలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్, గోపాల్రావుపల్లి సర్పంచ్ గుండు ప్రేమ్ కుమార్, ఉప సర్పంచ్ పొన్నాల నర్సింలు, మాజీ ఎంపీటీసీ శాగ దేవేందర్, నాయకులు లింగంపల్లి మధూకర్ తదితరులు పాల్గొన్నారు

జంట్ల సంక్షేమం కోసం లియాఫీ 1964 కృషి

- యూనియన్ డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇంచార్జిగా సరస్వతి ఎన్నిక
- ఇల్లందు ఎస్ఓ బ్రాంచ్‌లో ఘన సన్మానం..ఎల్ఐసీ ఏజెంట్ల హర్షం

వేద న్యూస్, ఇల్లందు :

భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమైక్య1964 వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో ఇల్లందు ఎస్ఓ బ్రాంచ్‌లో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ కమిటీ అసోసియేషన్ ఇంచార్జిగా ఎన్నికైన సరస్వతి గారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక ఏజెంట్లతో సమావేశమైన నాయకులు సరస్వతి ఎన్నిక వరంగల్ డివిజన్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. బ్రాంచ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు, బ్రాంచ్ నాయకులు ఆమెకు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే యూనియన్ ఆల్ ఇండియా జనరల్ బాడీ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇల్లందు అధ్యక్షుడు ఇందుర్తి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇల్లందు ఎస్ఓ బ్రాంచ్ నుండి 25 మంది సభ్యులను ఆల్ ఇండియా జనరల్ బాడీ కార్యక్రమానికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమైక్య1964 వరంగల్ డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్ హాజరై మాట్లాడుతూ, ఏజెంట్ల సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మహిళా ఏజెంట్లకు నాయకత్వ బాధ్యతలు దక్కడం సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాస్, కె. నిత్యానందం, కె. సుగుణాకర్, ఓరుగంటి రాజు, గంజి రాంబాబు, బి. రాములు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై క్షేత్రస్థాయి విచారణ

వేద న్యూస్ వరంగల్ :

ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఒక్కో ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించారు. సమస్యల తీవ్రతను తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం అందేలా ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. ఫిర్యాదులపై కేవలం కార్యాలయ స్థాయిలో కాకుండా క్షేత్రస్థాయిలో కూడా విచారణ చేపట్టాలని సీపీ స్పష్టం చేశారు. సంఘటన స్థలాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, బాధితులు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సేకరించి నిష్పక్షపాత దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించారు. కేసుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు. అర్జీలు స్వీకరించిన వెంటనే సీపీ సంబంధిత ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదు పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, బాధితులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు న్యాయం అందించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ప్రజలు పోలీస్ శాఖపై నమ్మకంతో తమ సమస్యలను తెలియజేస్తున్నందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. చట్టపరమైన పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల విభాగం ద్వారా ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పోలీస్ అధికారులు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను నమోదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని సీపీ పేర్కొన్నారు.

నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అరుణ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభం

వేద న్యూస్, రుద్రూర్:

రుద్రూర్ మండలంలోని రాణంపల్లి గ్రామానికి చెందిన తెలుగడం లావణ్య, అరుణ్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం గృహ యజమానులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షాదుల్, వార్డు సభ్యులు రాజు, కొండల్వాడి రాజు, తోట నర్సింగ్‌రావు, నీరడి శంకర్, తోట భాస్కర్, కరొళ్ల సత్యం, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు తోట సంగయ్య, నెరుగంటి బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం జూన్ 02 , 2026

అవార్డులతో కోట్ల వర్షం.. వైభవ్ ఖాతాలో రూ.2.5 కోట్లకు పైగా

వేద న్యూస్ డెస్క్:

భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026 సీజన్‌లో తన అద్భుత బ్యాటింగ్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేశాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే టోర్నీ మొత్తాన్ని శాసించిన ఈ యువ ఆటగాడు పరుగుల వరద పారించడమే కాకుండా భారీ మొత్తంలో నగదు బహుమతులు కూడా సొంతం చేసుకున్నాడు. ఈ సీజన్‌లో మ్యాచ్ ఫీజులు, అవార్డులు, నగదు బహుమతులు కలిపి అతని ఆదాయం రూ.2.5 కోట్లకు పైగా చేరినట్లు సమాచారం. ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ 776 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. గత సీజన్ వేలంలో రూ.1.10 కోట్లకు అతడిని కొనుగోలు చేసిన రాజస్థాన్ జట్టు ఈసారి కూడా అతడిని కొనసాగించింది. జట్టు ఫైనల్‌కు చేరకపోయినా, వ్యక్తిగత ప్రదర్శనతో వైభవ్ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. సీజన్ ముగింపు సందర్భంగా అతడికి పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. అత్యంత విలువైన ఆటగాడిగా ఎంపికై రూ.15 లక్షలు అందుకోగా, అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రూ.10 లక్షల నగదు బహుమతి దక్కింది. అత్యుత్తమ దూకుడు బ్యాటర్‌గా ఎంపికై మరో రూ.10 లక్షలతో పాటు ఒక కారు కూడా సొంతం చేసుకున్నాడు. సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా మరో రూ.10 లక్షలు, ఉత్తమ యువ ఆటగాడిగా మరో రూ.10 లక్షలు అందుకున్నాడు. ఇక మ్యాచ్ ఫీజుల రూపంలో కూడా వైభవ్ భారీ మొత్తాన్ని ఆర్జించాడు. మొత్తం 16 మ్యాచ్‌లు ఆడిన అతడికి ఒక్కో మ్యాచ్‌కు రూ.7.5 లక్షల చొప్పున సుమారు రూ.1.20 కోట్లు లభించాయి. అదనంగా మ్యాచ్‌లో అత్యుత్తమ ఆటగాడు, అత్యధిక సిక్సర్లు, వేగవంతమైన ఇన్నింగ్స్ వంటి విభాగాల్లో కూడా పలు

నగదు బహుమతులు గెలుచుకున్నాడు. మొత్తంగా జట్టు ఒప్పందం, మ్యాచ్ ఫీజులు, వ్యక్తిగత అవార్డులు, ప్రత్యేక బహుమతులు అన్నీ కలిపి వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో రూ.2.5 కోట్లకు పైగా ఆర్జించినట్లు అంచనా. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఇంతటి విజయాన్ని సాధించిన ఈ యువ క్రికెటర్ భవిష్యత్తులో భారత క్రికెట్‌కు కీలక ఆటగాడిగా ఎదుగుతాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్సీబీకి భారీ షాక్.. టిమ్ డేవిడ్‌పై నిషేధం, వచ్చే సీజన్ తొలి మ్యాచ్‌కు దూరం

వేద న్యూస్ డెస్క్:

ఐపీఎల్ చరిత్రలో వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి అరుదైన ఘనత సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. జట్టు విదేశీ ఆటగాడు టిమ్ డేవిడ్‌పై ఐపీఎల్ యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంది. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కారణంగా అతడిని వచ్చే సీజన్‌లో జట్టు ఆడే తొలి మ్యాచ్‌కు అనర్హుడిగా ప్రకటించారు. అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ సందర్భంగా టిమ్ డేవిడ్ అనుచితంగా ప్రవర్తించినట్లు అధికారులు గుర్తించారు. గుజరాత్ ఇన్నింగ్స్ పదో ఓవర్ సమయంలో అతడు కోపోద్రిక్తుడై ఐస్ ప్యాక్‌ను అంపైర్ నితిన్ మీనన్ వైపు విసిరాడు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన మ్యాచ్ రిఫరీ అతనిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాడు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.9 ప్రకారం క్రికెట్ సామగ్రిని నిర్లక్ష్యంగా విసరడం, మ్యాచ్ అధికారులు లేదా అంపైర్లకు హాని కలిగించేలా ప్రవర్తించడం నేరంగా పరిగణించబడుతుంది. టిమ్ డేవిడ్ చర్య కూడా ఇదే నిబంధన కిందకు రావడంతో అతడికి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించారు. అంతేకాకుండా రెండు డీమెరిట్ పాయింట్లు కూడా నమోదు చేశారు. ఇంతకుముందు ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభ్యంతరకర సంజ్ఞల కారణంగా ఒక డీమెరిట్ పాయింట్, మరో మ్యాచ్‌లో రెండు డీమెరిట్ పాయింట్లు పొందిన టిమ్ డేవిడ్ ఖాతాలో ఇప్పటికే మూడు పాయింట్లు ఉన్నాయి. తాజా ఘటనతో మరో రెండు పాయింట్లు చేరి మొత్తం ఐదు డీమెరిట్ పాయింట్లకు చేరుకున్నాయి. ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఐదు డీమెరిట్ పాయింట్లు చేరుకున్న ఆటగాడిపై ఒక మ్యాచ్ నిషేధం అమలవుతుంది. దీంతో వచ్చే ఐపీఎల్ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆడే తొలి మ్యాచ్‌లో టిమ్ డేవిడ్ పాల్గొనలేడు. టైటిల్ విజయోత్సాహంలో ఉన్న బెంగళూరు జట్టుకు ఈ పరిణామం పెద్ద ఎదురుదెబ్బగా మారింది. జట్టు మధ్యవరుసలో కీలక పాత్ర పోషించే టిమ్ డేవిడ్ లేకపోవడం వచ్చే సీజన్ ఆరంభంలో జట్టు ప్రణాళికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

మహిళల టీ20ల్లో చరిత్ర సృష్టించిన

ఐర్లాండ్.. పాకిస్తాన్‌కు భారీ షాక్

వేద న్యూస్ డెస్క్:

మహిళల అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో ఐర్లాండ్ జట్టు అరుదైన ఘనత సాధించింది. పాకిస్తాన్ నిర్దేశించిన 176 పరుగుల భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించి, మహిళల టీ20ల్లో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా కొత్త చరిత్ర సృష్టించింది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో భారీ స్కోరు నమోదు చేసి ఐర్లాండ్ ముందు 176 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. లక్ష్యం కఠినంగా కనిపించినప్పటికీ, ఐర్లాండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ మ్యాచ్‌పై పట్టు సాధించారు. క్రీజులో నిలకడగా రాణించిన ఆమీ హంటర్ 56 పరుగులతో జట్టుకు బలమైన ఆరంభం అందించింది. మరోవైపు రెబెకా స్టాకెల్ అద్భుత బ్యాటింగ్‌తో 60 పరుగులు చేసి చివరి వరకు అజేయంగా నిలిచింది. వీరిద్దరి అర్ధశతకాలతో ఐర్లాండ్ జట్టు లక్ష్యాన్ని కేవలం 19.1 ఓవర్లలోనే మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి చేరుకుంది. ఈ విజయంతో మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన జట్టుగా ఐర్లాండ్ రికార్డు సృష్టించింది. పాకిస్తాన్ బౌలర్లు భారీ స్కోరు సాధించినప్పటికీ, ఐర్లాండ్ బ్యాటర్ల ధాటికి నిలువలేకపోయారు. చారిత్రాత్మక విజయంతో ఐర్లాండ్ మహిళల జట్టు ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించగా, ఆమీ హంటర్, రెబెకా స్టాకెల్ ఇన్నింగ్స్‌లు జట్టు విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ విజయాన్ని మహిళల ఐర్లాండ్ క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయిగా క్రీడా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

శ్రీలంక సిరీస్‌కు వెస్టిండీస్ జట్టు ప్రకటన..

వేద న్యూస్ డెస్క్:

వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న వెస్టిండీస్ క్రికెట్ జట్టు, శ్రీలంకతో జరగనున్న మూడు వన్డేల సిరీస్ కోసం పటిష్టమైన జట్టును ప్రకటించింది. షాయ్ హోప్ సారథ్యంలో 15 మంది సభ్యులతో కూడిన జట్టును సెలెక్టర్లు ఎంపిక చేశారు. అనుభవజ్ఞులు, యువ ఆటగాళ్ల సమతుల్య కలయికతో ఈ జట్టును రూపొందించడం విశేషం. జూన్ 3 నుంచి స్వదేశంలో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనున్న వెస్టిండీస్, ఈ సిరీస్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఇటీవల కాలంలో వన్డే క్రికెట్‌లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిన కరీబియన్ జట్టు, ఈ సిరీస్ ద్వారా కొత్త ఆత్మవిశ్వాసాన్ని పొందాలని భావిస్తోంది. జట్టులో సీనియర్ ఆల్‌రౌండర్ రోస్టన్ ఛేజ్‌కు మరోసారి అవకాశం లభించింది. అలాగే వేగవంతమైన బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్న యువ పేసర్లు షమర్ జోసెఫ్, జైడెన్ సీల్స్ కూడా జట్టులో చోటు దక్కించుకున్నారు. గాయాల నుంచి పూర్తిగా కోలుకున్న అల్జారీ జోసెఫ్ తిరిగి జట్టులోకి రావడం బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూర్చింది. ఇటీవల జరిగిన ఐపీఎల్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయినప్పటికీ షిమ్రన్ హెట్‌మైర్, షెర్ఫానే రూథర్‌ఫోర్డ్‌లపై సెలెక్టర్లు నమ్మకం ఉంచారు. వీరిద్దరూ మిడిలార్డర్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. జట్టులో అకీమ్ ఆగస్టే, జాన్ క్యాంప్‌బెల్, కేసీ కార్టీ వంటి బ్యాటర్లు కూడా స్థానం సంపాదించారు. స్క్వాడ్ ప్రకటన అనంతరం ప్రధాన కోచ్ డారెన్ సమీ మాట్లాడుతూ, వెస్టిండీస్‌ను స్వదేశంలో బలమైన వన్డే జట్టుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వెల్లడించాడు. వ్యక్తిగత ప్రదర్శనల కంటే జట్టు విజయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని, గత 18 నెలలుగా ఇదే దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నాడు. ప్రపంచకప్ అర్హత పోటీలకు ముందు ఈ సిరీస్ తమకు ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండర్లతో సమతుల్యంగా కనిపిస్తున్న ఈ జట్టుపై అభిమానుల్లో ఆశలు పెరిగాయి. స్వదేశంలో జరిగే ఈ సిరీస్‌లో శ్రీలంకపై ఆధిపత్యం చాటుతూ ప్రపంచకప్ ప్రయాణానికి విజయవంతమైన ఆరంభం ఇవ్వాలని వెస్టిండీస్ భావిస్తోంది. వెస్టిండీస్ జట్టు: షాయ్ హోప్ (కెప్టెన్), అకీమ్ ఆగస్టే, జాన్ క్యాంప్‌బెల్, కేసీ కార్టీ, రోస్టన్ ఛేజ్, మాథ్యూ ఫోర్డే, జస్టిన్ గ్రీవ్స్, షిమ్రన్ హెట్‌మైర్, అమిర్ జంగూ, అల్జారీ జోసెఫ్, షమర్ జోసెఫ్, గుడకేశ్ మోతీ, షెర్ఫానే రూథర్‌ఫోర్డ్, జైడెన్ సీల్స్, షమర్ స్ప్రింగర్.

లింగ వివక్ష వ్యాఖ్యలు.. టెన్నిస్ ఆటగాడికి భారీ జరిమానా



వేద న్యూస్ డెస్క్:

ప్రతిష్ఠాత్మకమైన ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో లింగ వివక్షపూరిత వ్యాఖ్యలు చేసిన ఓ టెన్నిస్ ఆటగాడిపై నిర్వాహకులు కఠిన చర్యలు తీసుకున్నారు. మహిళా చైర్ అంపైర్‌ను అవమానించేలా వ్యాఖ్యానించిన పెరుగ్వే ఆటగాడు అడాల్ఫో వల్లెజోకు భారీ జరిమానా విధించడం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. టోర్నీలో రెండో రౌండ్ మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన అడాల్ఫో వల్లెజో, తన మ్యాచ్‌కు మహిళా చైర్ అంపైర్ బదులుగా పురుష అంపైర్‌ను నియమించి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించాడు. ప్రేక్షకుల హోరాహోరీ అరుపులు, కోర్టులో నెలకొన్న వాతావరణాన్ని నియంత్రించడం మహిళా అంపైర్‌కు కష్టమని చెప్పడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఆ మ్యాచ్‌కు చైర్ అంపైర్‌గా వ్యవహరించిన అనా కర్వాల్హోను లక్ష్యంగా చేసుకుని చేసిన ఈ వ్యాఖ్యలను నిర్వాహకులు తీవ్రంగా పరిగణించారు. క్రీడల్లో లింగ వివక్షకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేస్తూ అడాల్ఫోపై సుమారు రూ.71 లక్షల జరిమానా విధించారు. అనంతరం అతడు క్షమాపణలు చెప్పినప్పటికీ, ఈ తరహా వ్యాఖ్యలను సహించబోమని నిర్వాహకులు తేల్చిచెప్పారు. ఈ వివాదం మరింత ముదరకముందే అడాల్ఫో వల్లెజో సామాజిక మాధ్యమాల ద్వారా వివరణ ఇచ్చాడు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, మహిళా అంపైర్ల పట్ల తనకు పూర్తి గౌరవం ఉందని పేర్కొన్నాడు. ఐదు గంటల పాటు సాగిన ఉత్కంఠభరిత పోరాటంలో ఓటమి పాలవడంతో భావోద్వేగానికి లోనై అలా మాట్లాడానని వివరించాడు. తన ఓటమికి చైర్ అంపైర్ కారణం కాదని స్పష్టం చేసిన అడాల్ఫో, మ్యాచ్ మొత్తం అనా కర్వాల్హో అత్యంత సమర్థంగా వ్యవహరించిందని కొనియాడాడు. ఈ ఘటన ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానని, భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని తెలిపాడు. కాగా, రెండో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన కొమే చేతిలో అడాల్ఫో వల్లెజో 6-3, 7-5, 3-6, 2-6, 7-6 (8) తేడాతో ఓటమి పాలయ్యాడు. ఐదు గంటలకు పైగా సాగిన ఈ మ్యాచ్ అనంతరం చేసిన వ్యాఖ్యలే అతడికి భారీ మూల్యం చెల్లించే పరిస్థితి తీసుకొచ్చాయి. ఈ ఘటనతో క్రీడా ప్రపంచంలో లింగ సమానత్వం, పరస్పర గౌరవం ఎంత ముఖ్యమో మరోసారి స్పష్టమైంది.

ఫిఫా వరల్డ్‌కప్ ప్రసార హక్కులు జీ సొంతం

వేద న్యూస్ డెస్క్:

భారత ఫుట్‌బాల్ అభిమానులకు జీ ఎంటర్‌టైన్‌మెంట్ శుభవార్త అందించింది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ టోర్నమెంట్ అయిన ఫిఫా వరల్డ్‌కప్‌కు సంబంధించిన ప్రసార హక్కులను జీ గ్రూప్‌కు చెందిన యునైట్8 స్పోర్ట్స్ దక్కించుకుంది. ఈ ఒప్పందం ప్రకారం 2026, 2030 ఫిఫా వరల్డ్‌కప్‌లతో పాటు పలు ప్రధాన ఫిఫా టోర్నీలు 2034 వరకు జీ నెట్‌వర్క్‌లో ప్రసారం కానున్నాయి. టెలివిజన్ ప్రేక్షకులు యునైట్8 స్పోర్ట్స్ ఛానళ్లలో మ్యాచ్‌లను వీక్షించగలుగుతారు. డిజిటల్ వేదికలో జీ5 ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు అందుబాటులో ఉండనున్నాయి. పురుషుల వరల్డ్‌కప్‌తో పాటు మహిళల వరల్డ్‌కప్, అండర్-17, అండర్-20 ప్రపంచకప్‌లు, ఫుట్‌సాల్ ప్రపంచకప్ వంటి ప్రధాన అంతర్జాతీయ టోర్నీల హక్కులు కూడా ఈ ఒప్పందంలో భాగంగా జీ నెట్‌వర్క్‌కు లభించాయి. హిందీ ప్రసారాలు యునైట్8 స్పోర్ట్స్ 1, యునైట్8 స్పోర్ట్స్ 1 హెచ్‌డీ ఛానళ్లలో అందుబాటులో ఉండగా, ఇంగ్లీష్ ప్రసారాలు యునైట్8 స్పోర్ట్స్ 2, యునైట్8 స్పోర్ట్స్ 2 హెచ్‌డీ ఛానళ్లలో ప్రసారం కానున్నాయి. ఈ హక్కుల కోసం మరో ప్రముఖ మీడియా సంస్థ కూడా పోటీపడినప్పటికీ, ఆర్థిక అంశాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చివరకు జీ నెట్‌వర్క్‌కే అవకాశం దక్కింది. 2026 ఫిఫా వరల్డ్‌కప్ అమెరికా, కెనడా, మెక్సికో దేశాల్లో జరగనున్న నేపథ్యంలో మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రసారమయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా జీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి పునిత్ గోయెంకా ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచంలో అత్యధిక మంది వీక్షించే క్రీడా మహాసంగ్రామాన్ని భారత ప్రేక్షకులకు అందించడం గర్వకారణమని, ఫుట్‌బాల్ అభిమానులకు అత్యుత్తమ వీక్షణ అనుభవాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. క్రీడా ప్రసార రంగంలో చాలా ఏళ్ల విరామం తర్వాత జీ నెట్‌వర్క్ మళ్లీ భారీ స్థాయిలో అడుగుపెడుతుండటం పరిశ్రమ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2026 ఫిఫా వరల్డ్‌కప్ జూన్ 11 నుంచి ప్రారంభం కానుంది.

వేద న్యూస్

మంగళవారం జూన్ 02 , 2026

మోడ్రన్ లుక్‌లోనూ మెరిసిన ఐశ్వర్య మీనన్

వేద న్యూస్ డెస్క్:

దక్షిణాది సినీ పరిశ్రమలో తన అందం, అభినయం, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి ఐశ్వర్య మీనన్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సంప్రదాయ దుస్తుల్లో హుందాతనాన్ని, ఆధునిక వస్త్రధారణలో గ్లామర్‌ను సమపాళ్లలో ఆవిష్కరిస్తూ అభిమానులను అలరిస్తున్న ఈ అందాల భామ తాజాగా నిర్వహించిన ఫోటోషూట్‌తో నెట్టింట సంచలనంగా మారింది. ఆమె షేర్ చేసిన తాజా చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ అభిమానుల నుంచి భారీ స్పందనను అందుకుంటున్నాయి. తమిళ సినీ పరిశ్రమలో తన కెరీర్‌ను ప్రారంభించిన ఐశ్వర్య మీనన్, క్రమంగా తెలుగు, కన్నడ, మలయాళ చిత్రాల్లో అవకాశాలు అందుకుంటూ దక్షిణాది ప్రేక్షకులకు సుపరిచిత ముఖంగా మారింది. ప్రారంభ దశలో సహాయ పాత్రల్లో కనిపించిన ఆమె, తన నటనతో దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా తమిళ చిత్రాల్లో చేసిన పాత్రలు ఆమెకు మంచి గుర్తింపు తీసుకువచ్చాయి. విభిన్న కథాంశాలతో తెరకెక్కిన చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంది. తెలుగు ప్రేక్షకులకు ఆమె నిఖిల్ సిద్ధార్థ్ కథానాయకుడిగా నటించిన 'స్పై' చిత్రంతో పరిచయమైంది. జాతీయ దర్యాప్తు సంస్థ అధికారిణి పాత్రలో ఆమె చూపించిన నటనకు మంచి ప్రశంసలు లభించాయి. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, ఐశ్వర్య మీనన్‌కు మాత్రం మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఆ తర్వాత 'భజే వాయు వేగం' చిత్రంలోనూ ఆమె నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమా ఫలితం ఆశించిన విధంగా లేకపోయినా, ఆమె నటనకు మంచి స్పందన లభించింది. ప్రస్తుతం సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఐశ్వర్య మీనన్ అత్యంత చురుకుగా ఉంటోంది. ఇన్‌స్టాగ్రామ్, ఇతర సామాజిక మాధ్యమ వేదికల్లో తరచూ ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ అభిమానులతో మమేకమవుతోంది. తాజాగా ఆమె విడుదల చేసిన ఫోటోల్లో ఒకవైపు చీరకట్టులో సంప్రదాయ సౌందర్యాన్ని ప్రతిబింబిస్తే, మరోవైపు మోడ్రన్ దుస్తుల్లో స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంది. ఆమె ధరించిన దుస్తులు, హావభావాలు, ఫోటోగ్రఫీ శైలి అభిమానులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఈ చిత్రాలపై అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. "అందం, అభినయం కలిసిన నటి", "చీరలో దేవకన్యలా కనిపిస్తున్నారు", "మోడ్రన్ లుక్‌లో మరింత అందంగా ఉన్నారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సినీ అభిమానులతో పాటు ఫ్యాషన్ ప్రేమికులు కూడా ఆమె స్టైల్‌ను మెచ్చుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఆమె ఫోటోలు వేల సంఖ్యలో లైక్‌లు, కామెంట్లు సొంతం చేసుకుంటూ వైరల్‌గా మారాయి. సినిమాల ఎంపిక విషయంలో కూడా ఐశ్వర్య మీనన్ ప్రస్తుతం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న కథలను ఎంపిక చేసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. బలమైన కథాంశాలు, ప్రేక్షకులపై ప్రభావం చూపే పాత్రల కోసం ఎదురుచూస్తున్న ఆమె, త్వరలోనే కొత్త ప్రాజెక్టులను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. అందం, అభినయం, ఫ్యాషన్ సెన్స్‌తో యువతలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఐశ్వర్య మీనన్, ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్న ప్రతిభావంతమైన కథానాయికల్లో ఒకరిగా నిలుస్తోంది. సోషల్ మీడియాలో ఆమె పెరుగుతున్న ఆదరణను చూస్తుంటే, రాబోయే రోజుల్లో మరిన్ని పెద్ద ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించే అవకాశాలు కనిపిస్తున్నాయి

పారడైజ్ క్లైమాక్స్‌లో మెగా ట్విస్ట్?

వేద న్యూస్ డెస్క్:

'దసరా' చిత్రంతో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కిస్తున్న 'పారడైజ్' సినిమాతో బిజీగా ఉన్నారు. అయితే ఈ సినిమా చుట్టూ ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికర ప్రచారం సాగుతోంది. 'పారడైజ్' చిత్ర క్లైమాక్స్‌లో భారీ ట్విస్ట్‌తో పాటు మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక ఎంట్రీ ఉండబోతుందనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరంజీవి ఓ సినిమా చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'పారడైజ్' సినిమా కథకు, చిరంజీవితో తెరకెక్కబోయే ప్రాజెక్ట్‌కు అనుసంధానం ఉండవచ్చనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే కీలక సన్నివేశం ద్వారా ఈ రెండు కథలను కలిపే ప్రయత్నం జరుగుతోందని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అంతేకాకుండా 'పారడైజ్' కథకు ముందు జరిగిన సంఘటనల ఆధారంగా మరో ప్రీక్వెల్ చిత్రాన్ని కూడా రూపొందించే ఆలోచనలో దర్శకుడు ఉన్నారనే ప్రచారం వినిపిస్తోంది. ఈ విధంగా ఒకే కథా ప్రపంచానికి చెందిన పలు చిత్రాలతో ప్రత్యేక సినీమాటిక్ యూనివర్స్‌ను నిర్మించే దిశగా శ్రీకాంత్ ఓదెల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. అయితే ఈ అంశాలపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సమాచారం కేవలం ప్రచారంగా మాత్రమే భావించాల్సి ఉంది. అయినప్పటికీ నాని, చిరంజీవి అభిమానుల్లో ఈ వార్తలు భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. 'పారడైజ్' విడుదల తర్వాత ఈ ప్రచారాల్లో ఎంత నిజం ఉందో తేలనుంది.

'మగధీర' సెట్స్‌లో చరణ్ అల్లరి.. ఆసక్తికర విషయం చెప్పిన కాజల్

వేద న్యూస్ డెస్క్:

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, నటి కాజల్ అగర్వాల్ జంటగా నటించిన 'మగధీర' చిత్రం తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకుని అనేక రికార్డులు సృష్టించింది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ సమయంలో జరిగిన సరదా సంఘటనలను కాజల్ అగర్వాల్ అభిమానులతో పంచుకున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన కాజల్, 'మగధీర' చిత్రీకరణ రోజుల్లో రామ్ చరణ్ తనను సరదాగా ఆటపట్టించేవాడని గుర్తు చేసుకున్నారు. సినిమాలో గుర్రపు స్వారీ సన్నివేశాలు కీలకంగా ఉండటంతో రామ్ చరణ్ తన సొంత గుర్రం 'బదల్'ను చిత్రీకరణకు తీసుకువచ్చేవాడని తెలిపారు. చిత్రీకరణ విరామ సమయంలో తనను ఆ గుర్రంపై కూర్చోబెట్టి తిప్పేవాడని, అనంతరం అదే గుర్రం పేరును పదేపదే పిలుస్తూ సరదాగా అల్లరి చేసేవాడని కాజల్ వెల్లడించారు. తాను ఎక్కడ కనిపించినా "బదల్... బదల్..." అంటూ గట్టిగా పిలిచి అందరినీ నవ్వించేవాడని చెప్పారు. ఆ రోజుల జ్ఞాపకాలు ఇప్పటికీ తనకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తాయని, రామ్ చరణ్ చేసిన సరదా చేష్టలు మరచిపోలేనివని కాజల్ పేర్కొన్నారు. 'మగధీర' చిత్రీకరణ సమయంలో ఏర్పడిన అనుబంధం ఇప్పటికీ తన మనసులో నిలిచిపోయిందని తెలిపారు. ఇదిలా ఉండగా, రామ్ చరణ్ ప్రస్తుతం తన తాజా చిత్రం 'పెద్ది' ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉన్నారు. భారీ అంచనాల మధ్య రూపొందిన ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినీ అభిమానులు ఈ సినిమాపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అలియా భట్‌తో గొడవల వార్తలు అవాస్తవం: బాబీ డియోల్

వేద న్యూస్ డెస్క్:

బాలీవుడ్ సీనియర్ నటుడు బాబీ డియోల్ తనపై, ప్రముఖ నటి అలియా భట్‌పై సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న విభేదాల వార్తలను పూర్తిగా ఖండించారు. ప్రస్తుతం అలియా భట్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న గూఢచారి యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ఆల్ఫా'లో కీలక పాత్ర పోషిస్తున్న బాబీ డియోల్, షూటింగ్ సమయంలో తమ మధ్య ఎలాంటి గొడవలు జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల ఒక టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాలపై స్పందిస్తూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక స్నేహితుడు ఆ కథనాలను తనకు పంపించగా చూసి ఆశ్చర్యపోయానని, వాటిలో ఎలాంటి నిజం లేదని తెలిపారు. కొందరు కాలక్షేపం కోసం లేని విషయాలను సృష్టించి ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అలియా భట్ గురించి మాట్లాడిన బాబీ డియోల్, ఆమెను అత్యంత ప్రతిభావంతమైన నటిగా కొనియాడారు. పాత్ర కోసం ఆమె చేసే కృషి, అంకితభావం తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె తీసుకున్న శిక్షణ, చేసిన సన్నాహాలు విశేషంగా అనిపించాయని వెల్లడించారు. ఇటీవల రణబీర్ కపూర్‌తో కలిసి నటించిన 'యానిమల్' చిత్రం తనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టిందని గుర్తు చేసిన బాబీ డియోల్, ఇప్పుడు అలియా భట్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. రణబీర్, అలియా ఇద్దరూ తనకు ఎంతో ఇష్టమైన నటీనటులని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై స్పందిస్తూ, ప్రతి పుకారుకు వివరణ ఇవ్వడం సాధ్యం కాదని ఆయన అన్నారు. ఒక పుకారు ముగియకముందే మరో కొత్త కథ

ప్రచారంలోకి వస్తోందని వ్యాఖ్యానించారు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే అనేక కథనాలు కేవలం ఊహాగానాలేనని, వాటిని నమ్మే ముందు నిజానిజాలు తెలుసుకోవాలని అభిమానులకు సూచించారు ప్రస్తుతం బాబీ డియోల్ వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రతినాయక పాత్రల్లో తనదైన ముద్ర వేస్తూ దేశవ్యాప్తంగా అభిమానులను ఆకట్టుకుంటున్న ఆయన, రాబోయే చిత్రాలపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.

'ఇరుముడి' నుంచి భారీ అప్‌డేట్..

వేద న్యూస్ డెస్క్:

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రకటించిన నాటి నుంచే సినీ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే చిత్రానికి సంబంధించిన ప్రచార సామగ్రి మంచి స్పందన పొందగా, తాజాగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్లింప్స్ విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. 'హార్ట్ ఆఫ్ ఇరుముడి' పేరుతో ప్రత్యేక గ్లింప్స్‌ను జూన్ 3న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ కూడా అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సాధారణ మాస్ ప్రచారానికి భిన్నంగా భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇస్తూ పోస్టర్‌ను రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'హార్ట్ ఆఫ్ ఇరుముడి' అనే శీర్షికను పరిశీలిస్తే సినిమాలో భావోద్వేగాలకు కీలక స్థానం ఉండబోతున్నట్లు స్పష్టమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ చిత్రాల్లో మానవ సంబంధాలు, భావోద్వేగాలు ప్రధాన బలంగా నిలుస్తుంటాయి. అదే తరహాలో ఈ చిత్రంలో కూడా భావోద్వేగ కథనంతో పాటు రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ అంశాలను సమతుల్యంగా చూపించనున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవలి కాలంలో విభిన్న కథలు, కొత్త తరహా పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న రవితేజ, ఈ చిత్రంలో మరో కొత్త కోణంలో కనిపించనున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. సినిమా ప్రకటన నుంచి విడుదలవుతున్న ప్రతి అప్‌డేట్ సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందనను అందుకుంటోంది.

గోపీచంద్ కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం

వేద న్యూస్ డెస్క్:

యాక్షన్ హీరో గోపీచంద్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న కొత్త సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. ప్రముఖ ఫైట్ మాస్టర్ వీ వెంకట్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం మరో చిత్రంలో నటిస్తున్న గోపీచంద్, అదే సమయంలో ఈ కొత్త ప్రాజెక్టును కూడా పట్టాలెక్కించడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో అనార్కలి నాజర్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సంగీతాన్ని శ్యామ్ సీఎస్ అందిస్తున్నారు. ఇటీవల విడుదలైన తొలి ప్రచార చిత్రంలో మండుతున్న ఆకాశం మధ్య కొండపై నిలిచిన నల్ల చిరుత దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రచార చిత్రం ద్వారా సినిమా తీవ్రమైన యాక్షన్, పురాణ గాథల నేపథ్యంతో రూపొందుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. జాతీయ పురస్కార గ్రహీత శ్రీకర్ ప్రసాద్ చిత్రానికి ఎడిటర్‌గా పనిచేస్తుండగా, రామకృష్ణమౌనిక నిర్మాణ రూపకల్పన బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073